క్లుప్తంగా

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయండి



పనులు పరిశీలిస్తున్న డీపీవో శ్రీనివాస్

కుంటాల: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని డీపీవో శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని విఠాపూర్ గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఇళ్లను నాణ్యతగా చేపట్టడంతోపాటు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎంపీవో ఎంఏ రహీంఖాన్, ఏపీవో గట్టుపల్లి నవీన్, కార్యదర్శి ఉత్తం, ఎఫ్ఏ సుదర్శన్ తదితరులు ఉన్నారు.

పనులు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి జీవరత్నం

ఖానాపూర్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పెండింగ్ పనులను పూర్తి చేయించాలని మండల ప్రత్యేకాధికారి జీవరత్నం అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. మన ఊరు–మన బడితోపాటు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో గతంలో చేపట్టిన పనులు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో సునీత, తహసీల్దార్ సుజాత, ఎంపీవో రత్నాకర్‌రావు తదితరులు ఉన్నారు.

పందిళ్లు ఏర్పాటు చేయాలి

లోకేశ్వరం: ఎండలు పెరుగుతున్నందున నర్సరీలో మొక్కలపై చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలని ఎంపీడీవో వెంకటరమేశ్ అన్నారు. గురువారం మండలంలోని హవర్గ గ్రామంలోని నర్సరీ, సెగ్రిగేషన్‌షెడ్డులో వర్మీ కంపోస్టును పరిశీలించారు. ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో ఉదయమే ప్రజలు ఉపాధి పనులకు వెళ్లేలా చూడాలని పేర్కొన్నారు. బస్టాండు ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆయన వెంట ఏపీవో జగన్నాథ్ ఉన్నారు.

'ఒకే దేశం- ఒకే ఎన్నిక'పై అవగాహన

ఖానాపూర్: పట్టణంలోని గ్రంథాలయంలో గురువారం ఒకే దేశం–ఒకే ఎన్నికపై బీజేపీ నాయకులు నిరుద్యోగ యువతకు అవగాహన కల్పించారు. వన్ నేషన్– వన్ ఎలక్షన్ అనేది ఎన్నికల వ్యయాన్ని తగ్గించే లక్ష్యంతో చేపట్టిన విధానపర నిర్ణయమని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. రవీందర్ రెడ్డి, అనిల్‌రావు తదితరులు ఉన్నారు.

డీవైఎస్‌వో తనిఖీ



సూచనలు చేస్తున్న జిల్లా అధికారి శ్రీకాంత్

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని జిల్లా యువజన శాఖ క్రీడా అధికారి శ్రీకాంత్‌రెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా క్రీడాకారుల హాజరు, శిబిరంలో వసతులను పరిశీలించారు. కార్యక్రమంలో పెటా కార్యదర్శి భోజన్న, ఎస్జీఎఫ్ కార్యదర్శి రవీందర్ గౌడ్, పీడీ ఇమ్రాన్, పీఈటీలు ఉన్నారు.

బాబా ఆలయంలో పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

కుంటాల: మండలంలోని కల్లూరు సాయిబాబా ఆలయంలో గురువారం సందడి నెలకొంది. మధ్యాహ్న హారతి కార్యక్రమంలో భక్తులు తరలివచ్చి పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

ఎంపీడీవోకు వినతి

లక్ష్మణచాంద: తమ గ్రామంలో చర్చి నిర్వహణను ఆపాలని కోరుతూ మండలంలోని కనకాపూర్ వీడీసీ నాయకులు ఎంపీడీవో రాధకు వినతిపత్రం అందజేశారు.ఓ ఇంటిలో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న చర్చితో తమకు ఇబ్బందిగా ఉందని.. సమస్య పరిష్కరించాలని కోరారు. ఇందులో వీడీసీ సభ్యులు నరేశ్, ప్రమోద్, పవన్, భీమేశ్, హన్మండ్లు తదితరులు ఉన్నారు.

కొనుగోళ్ల ప్రారంభమెప్పుడో..?



కడెం: మండలంలోని పెద్దబెల్లాల్ గ్రామంలో గిరిజన్ కోఆపరేటివ్ కార్పొరేషన్(జీసీసీ) ఆ ధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రం ఏ ర్పాటు చేసి 15 రోజులు దాటింది. కానీ నేటికి కొనుగోళ్లు ప్రారంభించలేదు. అకాల వర్షాలతో తమ పంట తడుస్తుందని కుప్పల వద్దే రైతులు పడిగాపులు కాస్తున్నారు. ఇప్పటికైనా జీసీసీ అధికారులు స్పందించి తూకం ప్రారంభించాలని రైతులు వేడుకుంటున్నారు.

సర్వర్ డౌన్‌తో నిరీక్షణ..!

కుంటాల: మండలంలోని రేషన్ షాపుల్లో సాంకేతిక సమస్య తలెత్తి సర్వర్‌డౌన్ కావడంతో ఈ-పాస్ యంత్రం పని చేయడం లేదు. కుంటాలలో గురువారం రేషన్‌బియ్యం కోసం వెళ్లిన వినియోగదారులు గంటల తరబడి ఇలా నిరీక్షించారు.



ఊరంతా 'ఉపాధి'కే



కడెం: వ్యవసాయ పనులు ముగియడంతో గ్రామాల్లోని ప్రజలు ఉత్సాహంగా ఉపాధి పనులకు వెళ్తున్నారు. మండలంలోని ఉడుంపూర్ గ్రామపంచాయతీ పరిధిలో 800 మంది ఉపాధి కూలీలు ఉండగా.. బుధవారం 700 మంది, గురువారం 680 మంది పనులకు వచ్చినట్లు ఫీల్డ్ అసిస్టెంట్ రవీందర్ పేర్కొన్నారు

తలుపుల్లేవ్, నీళ్లు రావు

కుంటాల: మండలకేంద్రంలో రూ.22లక్షలతో నిర్మించిన రైతువేదిక వద్ద మరుగుదొడ్డికి నీళ్లు రావు.. తలుపులూ బిగించలేదు. దీంతో సభలు, సమావేశాలకు వచ్చే రైతులు, సిబ్బంది ఒంటికి, రెంటికీ వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారు. నీటి సౌకర్యం కల్పించి మరుగుదొడ్డిని వినియోగంలోకి తేవాలని రైతులు కోరుతున్నారు.



తాగునీటిని వృథా చేస్తున్నరు..

- ట్యాంకు నిండి రోడ్డుపై ప్రవహిస్తున్న వైనం



రోడ్డుపై పారుతున్న నీరు



ట్యాంకు నుంచి పడి కాల్వలోకి పోతున్న నీరు

లక్ష్మణచాంద: మండు వేసవిలో జనం తాగునీటికి అల్లాడుతుంటే లక్ష్మణచాంద మండలం చామన్‌పెల్లి గ్రామంలో మాత్రం నీటిని వృథా చేస్తున్నారు. ట్యాంకుకు నీటిని సరఫరా చేసే బోరు మోటారు.. కరెంట్ ఉన్నత వరకు నడుస్తూనే ఉంటుంది. ట్యాంకు నిండినా పంచాయతీ సిబ్బంది మోటార్ ఆఫ్ చేయడం లేదు. దీంతో తాగు నీరంతా వృథాగా మురుగు కాల్వ గుండా రోడ్డుపై ప్రవహిస్తోంది. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.

గుంతల రోడ్లతో తిప్పలు

- కంకరతేలి అధ్వానంగా బీటీ రోడ్లు
- నిర్వహణను పట్టించుకోని అధికారులు
- రాకపోకలకు ప్రజల ఇబ్బంది
- మరమ్మతులు చేయించాలని వేడుకోలు



బెంబర సమీపంలో అధ్వానంగా రోడ్డు



వడ్‌ఝురి సమీపంలో కంకర తేలి గుంతలమయంగా ఝురి(బి)కి వెళ్లే రోడ్డు

తానూరు: మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లకు గుంతలు ఏర్పడి అధ్వానంగా మారడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన రోడ్ల నిర్వహణను పట్టించుకోకపోవడంతో వాహనదారులకు కష్టాలు తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయించడంతోపాటు అవసరమైన చోట కొత్తవి నిర్మించి ఆర్టీసీ బస్సులు నడిపించాలని కోరుతున్నారు.

అధ్వానంగా రోడ్లు..

ఏళ్ల కిందట నిర్మించిన తానూరు మండలంలోని తానూరు–బెల్‌తరోడా ఎక్స్‌రోడ్డు నుంచి ఝురి(బి), ఝురి(బి)తండా, బెంబర, ఉమ్రి(కే)గ్రామానికి వెళ్లే బీటీరోడ్లు, ముధోల్ నుంచి ఎల్వత్ వెళ్లే రోడ్లు కంకర తేలి గుంతలమయంగా మారాయి. ఈరోడ్డుపై వచ్చి వెళ్లాలంటే జంకుతున్నారు. వాహనాలు సైతం తరచుగా మరమ్మతులకు గురవుతున్నాయని వాహనదారులు పేర్కొంటున్నా రు.

కానరాని బస్సు సౌకర్యం..

ఆయా గ్రామాలకు రోడ్లు సరిగా లేకపోవడంతో ఆర్టీసీ బస్సులు నడవడం లేదు. దీంతో చాలా మంది ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. వారు కూడా గుంతల రోడ్లనే కారణంగా అధిక చార్జీలు వసూలు చేస్తున్నారని గ్రామీణ ప్రజలు వాపోతున్నారు.

ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు..

మండలంలోని ఝురి(బి), ఝురి(బి)తండా, ఉమ్రి(కె), బెంబర గ్రామాలకు ఉన్న బీటీ రోడ్లు కొన్నేళ్లుగా మరమ్మతులకు నోచుకోవడం లేదు. దీంతో రాత్రి వేళలో గుంతలు తెలియక చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

గ్రామాల్లోని సమస్యలు పరిష్కరించండి

తానూరు: గ్రామాల్లోని సమస్యలు తక్షణం పరిష్కరించాలని ఎంపీడీవో నసీరొద్దీన్.. పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. గురువారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందికి నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడారు. రాజీవ్ యువవికాసం పథకానికి దరఖాస్తు చేసుకున్న ఆన్‌లైన్ ప్రతులను కార్యాలయంలో అందించాలన్నారు. గ్రామపంచాయతీలో అవసరం ఉన్న చోట ఇంకుడుగుంతలు నిర్మించుకునేందుకు తీర్మానం చేసి కార్యాలయంలో నివేదిక అందించాలని పేర్కొన్నారు. నర్సరీలో మొక్కలు ఎండిపోకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీవో శివలింగయ్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి నిధులు మంజూరు చేయిస్తా

- ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

లోకేశ్వరం: నిధులు మంజూరు చేయించి గ్రామాలను అభివృద్ధి చేయిస్తానని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. గురువారం మండలకేంద్రంలోని రైతువేదికలో వివిధ గ్రామాలకు చెందిన 37 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పంచగుడి–వాస్తాపూర్ సింగిల్ రోడ్డు కోసం రూ.2కోట్ల30 లక్షలు మంజూరు చేయించామని పేర్కొన్నారు.అర్లి వంతెన డబుల్ రోడ్డు నిర్మాణం కోసం రూ.86 కోట్లకు ప్రతిపాదనలు పంపించామన్నారు. రాజూర ఎత్తిపోతల పథకం మరమ్మతుల కోసం రూ.10 లక్షలు మంజూరు చేశామన్నారు. పిప్రి ఎత్తిపోతల పథకం ద్వారా ప్రతి గుంటకు సాగు నీరందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల కన్వీనర్ సాయన్న, తహసీల్దార్ మోతీరాం, ఎంపీడీవో వెంకటరమేశ్, శ్రీధర్, చిన్నారావు, రాజశేఖర్, శంకర్‌గౌడ్, విలాస్, సుమన్‌కుమార్, లింగన్న, సంటెన్న ఉన్నారు.

రైతులకు అవగాహన సదస్సు ..

ముధోల్: మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో గురువారం జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం, వ్యవసాయశాఖ సంయుక్తంగా రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ హాజరై మాట్లాడారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించిన సాగు పద్ధతులను రైతులు పాటించి అధిక దిగుబడులు పొందాలని సూచించారు. భూసార పరీక్షలు చేయించుకొని వాటి ఫలితాల ఆధారంగా ఎరువులను వాడితే మంచి లాభాలు వస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు నర్సయ్య, కార్తీక్, విజయ్‌కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్‌రావ్ పటేల్, మాజీ జెడ్పీటీసీ లక్ష్మినర్సాగౌడ్, నాయకులు పాల్గొన్నారు. మండలంలోని బ్రాహ్మన్‌గాం గ్రామంలో మార్కెఫెడ్ ఆధ్వర్యంలో సన్‌ఫ్లవర్ సీడ్ విత్తనాల కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాల్‌కు రూ.7,280 ఉందని.. సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు.న్నారు.కొనుగోలులో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చూద్దాం



అవగాహన కల్పిస్తున్న ఇన్‌చార్జి ఏడీఈ శ్రీనివాస్

దస్తురాబాద్: ముందస్తు జాగ్రత్తలతో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా నివారించవచ్చని ఇన్‌చార్జి ఏడీఈ టి.శ్రీనివాస్ సూచించారు. గురువారం దస్తురాబాద్ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై రైతులకు, వినియోగదారులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలన్నారు. మోటర్ల వద్ద కెపాసిటర్లు అమర్చుకోవటం, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఎర్తింగ్, కాలిన తీగలు సరిచేయటం వంటి చర్యలతో విద్యుత్ ప్రమాదాలను నివారించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సింగరి కిషన్, శివయ్య, గోపి, తిరుపతి, రాజేశ్, యాదు, రాజలింగం, సిబ్బంది సత్యనారాయణ, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే జైలుకే



మాట్లాడుతున్న ఏడీఏ వినయ్‌బాబు

తానూరు: రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే ఫర్టిలైజర్ షాపుల లైసెన్సు రద్దుతోపాటు కేసు నమోదు చేసి జైలుకు పంపిస్తామని ముధోల్ ఏడీఏ వినయ్‌బాబు సూచించారు. మండలకేంద్రంలోని రైతువేదికలో గురువారం ఆయా గ్రామాల ఫర్టిలైజర్ షాపుల యజమానులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడారు. రైతులు తప్పనిసరిగా కొనుగోలు సమయంలో రసీదు తీసుకోవాలన్నారు. వ్యాపారులు అమ్మిన స్టాక్ వివరాలను విధిగా రిజిస్టర్లలో ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. రసాయనాలు తగ్గించి సేంద్రియ ఎరువులు వినియోగించేలా ఏఈవోలు గ్రామాల వారీగా రైతులకు అవగాహన కల్పించేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో మనీష, ఏఈ వోలు సంఘవి, పవన్, విష్ణు, ఆయా గ్రామాల ఫర్టిలైజర్ డీలర్లు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి



నమోదు చేస్తున్న ఏఈవో తిరుపతి

దస్తురాబాద్: రైతులు గుర్తింపు కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏఈఓ తిరుపతి సూచించారు. గురువారం మండలంలోని భూత్కూర్ గ్రామంలో రైతుల గుర్తింపు కార్డుల కోసం రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ప్రతి రైతు విధిగా ఆధార్, బ్యాంక్ వివరాలు, మొబైల్ వివరాలు తీసుకురావాలని సూచించారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ఖానాపూర్: మండలంలోని సుర్జాపూర్ గ్రామంలో బాధిత కుటుంబాలను గురువారం బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్‌నాయక్ పరామర్శించారు. గ్రామానికి చెందిన వేణు, నర్సింగరావుకు కుటుంబాలతోపాటు ఇటీవల మృతి చెందిన కొమ్ము రాజేందర్ కుటుంబీకులను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు.

అన్నివర్గాలకు ప్రభుత్వం పెద్దపీట



గౌడ కులస్తులకు కాటమయ్య కిట్‌లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ఖానాపూర్: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అన్నివర్గాల ప్రజల అభివృద్ధికి పెద్దపీట వేస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. గురువారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పలువురు గౌడ కులస్తులకు ఎమ్మెల్యే కాటమయ్య రక్ష కిట్లు పంపిణీ చేశారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదిన వేడుకలను ఎమ్మెల్యే ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి జరుపుకున్నారు. కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షుడు దయానంద్, రమేశ్, మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య ఉపకేంద్రానికి భూమిపూజ

దస్తురాబాద్: మండలంలోని రేవోజీపేట గ్రామంలో రూ.15 లక్షలతో చేపట్టే ఆరోగ్య ఉపకేంద్రం నిర్మాణానికి ఎమ్మెల్యే బొజ్జు పటేల్ భూమిపూజ చేశారు. మాజీ ఎంపీపీ సింగరి కిషన్, కాంగ్రెస్ నాయకులు రమేశ్‌రావ్, శరత్‌రెడ్డి, నరేశ్‌రెడ్డి, రాజేందర్, రాజేశం, నాగరాజు, గోపి, సత్తయ్య ఉన్నారు.

బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

కడెం: మండలంలోని చిన్నబెల్లాల్ గ్రామంలో జరుగుతున్న శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యేను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. అనంతరం మండలకేంద్రంలో మంత్రి పొన్న ప్రభాకర్ జన్మదిన వేడుకలు నిర్వహించగా ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఇందులో జిల్లా ఆర్టీఏ సభ్యులు తుమ్మల మల్లేశ్, ఏఎంసీ చైర్మన్ పడిగెల భూషణ్, పొద్దుటూరి సతీశ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్‌పర్సన్ శైలజరమేశ్‌రావు, శంకర్, బొడ్డు గంగన్న, చెన్నుమల్లేశ్, దుర్గె వెంకటేశ్ ఉన్నారు.

కల్తీ మద్యం అమ్మకాలను నిర్మూలించాలి

ఖానాపూర్: గుడుంబాతోపాటు కల్తీ మద్యం అమ్మకాలను ఎక్సైజ్ అధికారులు నిర్మూలించాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. గురువారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎక్సైజ్ అధికారులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. గుడుంబాను పూర్తిస్థాయిలో నివారించేందుకు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. కల్తీ మద్యం తాగి గ్రామాల్లో అనేక మంది చనిపోతున్నారనే విషయాన్ని ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ భూమన్న, వైస్‌చైర్మన్ మాజిద్, ఎక్సైజ్ సీఐ రంగస్వామి, ఎస్సైలు వసంత్‌రావు, మౌనిక, సిబ్బంది ఉన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన



బోనాలతో ఆలయానికి వెళ్తున్న భక్తులు

ఖానాపూర్: పట్టణంలోని గోదావరి తీరంలో ఇటీవల నిర్మించిన ఆలయంలో గురువారం తాతమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పండితులు కీర్తి రాఘవ శర్మ ఆధ్వర్యంలో యజ్ఞ హోమాలు, పూజాది కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం సంఘం ఆధ్వర్యంలో మహిళలు బోనాలు తీసుకొచ్చి నైవేద్యంగా సమర్పించారు. ఉత్సవాలకు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్, బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భుక్యా జాన్సన్‌నాయక్ హాజరై పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కొత్తపల్లి సురేశ్, గుగ్గిళ్ల ఎల్లయ్య, ఎనగంటి రాజేశ్వర్, కొత్తపల్లి నరేశ్, లింగన్న, శంకర్, ఇస్తారి తదితరులు ఉన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం



విరాళం అందిస్తున్న దాతలు

సోన్: మండలంలోని కడ్తాల్ గ్రామ అయ్యప్ప ఆలయం అభివృద్ధికి సారంగపూర్ మండలం మలక్‌చించోలి గ్రామానికి చెందిన ఉపాధ్యాయ దంపతులు సున్నం శ్రీవిద్య–బ్రహ్మయ్య రూ.25వేలను విరాళంగా అందించా రు. తమ వివాహ వార్షికోత్సవం పురస్కరించుకొని తమ కుటుంబసభ్యుల పేరిట విరాళం అందించినట్లు దాతలు పేర్కొన్నారు. వారి పలువురు ఉన్నారు.